క్లుప్తంగా

కథలు సమాజానికి ప్రతిబింబాలు



కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖ చిత్రకారుడు, రచయిత సుంకర చలపతిరావు

మల్కాపురం : సమాజంలోని వివిధ అంశాలను తెలుసుకోవడానికి కథలు చదవడం చాలా ముఖ్యమని ప్రముఖ చిత్రకారులు కళారత్న సుంకర చలపతిరావు అన్నారు. మల్కాపురం శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల సందర్భంగా మంగళవారం చిన్నారులకు కథలు చెప్పే కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న చలపతిరావు మాట్లాడుతూ, విద్యార్థులు చిన్నప్పటి నుంచే కథలు చదవడం, వాటిలోని సందేశాలను ఒక డైరీలో రాసుకోవడం అలవాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా పిల్లలకు కథలు చదివి వినిపించి, వాటిని వివరించారు. సమావేశంలో మహిళా నాయకురాలు జగదాంబ, గ్రంథాలయాధికారి అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 22 మంది విద్యార్థుల ఎంపిక



కళాశాల అధ్యాపకులతో ఎంపికైన విద్యార్థులు

గోపాలపట్నం: జీవీఎంసీ 88వ వార్డు నరవాలోని విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో ఇటీవల నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 22 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ విషయాన్ని కళాశాల ప్రిన్సిపాల్ జీవీ ప్రదీప్ వర్మ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సీఎస్ఈ, ఈసీఈ, ట్రిపుల్ ఈ విభాగాలకు చెందిన ఇంజనీరింగ్ విద్యార్థులు ఈ ఇంటర్వ్యూల్లో పాల్గొన్నారు. చెన్నైకి చెందిన కొలాబెర టెక్నాలజీస్ సంస్థ ఏడాదికి రూ.3 లక్షల వేతనంతో ఈ 22 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసింది. ఎంపికైన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్‌తో పాటు డీన్ సీడీసీ వర్మ, ప్రదీప్, శరణ్య తదితరులు అభినందించారు.

ముగిసిన ఆపస్ ఉపాధ్యాయుల సదస్సు



ఆపస్ సమావేశంలో ఉపాధ్యాయులు

ఆరిలోవ: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం(ఆపస్) రాష్ట్ర స్థాయి 'ప్రాంత అభ్యాస వర్గ' సదస్సు మంగళవారం ముగిసింది. విశాలాక్షినగర్ బీవీకే జూనియర్ కాలేజీ సమావేశ మందిరంలో రెండు రోజులపాటు జరిగిన ఈ సదస్సులో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న పలు సమస్యలు, వాటి పరిష్కారానికి చేపట్టాల్సిన చర్యలు తదితరవాటి గురించి ఆపస్ నాయకులు వివరించారు. విద్యా విధానంపై రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న పద్ధతుల గురించి చర్చించారు. కార్యక్రమంలో పలు జిల్లాలకు చెందిన ఆపస్ సంఘం కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై వినతి



స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్‌తో బీఎంఎస్ జాతీయ కార్యదర్శి పాండే

ఉక్కునగరం: ఉక్కు కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై బీఎంఎస్ నాయకులు యాజమాన్యానికి వినతిపత్రం అందజేశారు. బీఎంఎస్ జాతీయ కార్య దర్శి డీకే పాండేతో కలిసి స్టీల్ బీఎంఎస్ నాయ కులు మంగళవారం ఉక్కు డైరెక్టర్ (పర్సనల్) ఎస్‌సీ పాండేను కలిసి సమస్యలను వివరించారు. కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపును ఆపాలని కోరారు. కార్మికులకు వేతన ఒప్పందం చేయాలన్నారు. కార్యక్రమంలో కొమ్మినేని శ్రీనివాస్, మద్దాల పెంటారావు, జి. గురప్ప, జగన్నాథం, ఎస్. గురుమూర్తి పాల్గొన్నారు.

ఘనంగా నృత్య పోటీలు

అగనంపూడి: అంతర్జాతీయ నృత్య దినోత్సవం సందర్భంగా దువ్వాడ విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు నృత్య పోటీలు నిర్వహించి ఉత్తమ ప్రదర్శన చేసిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో కళాశాల పిన్సిపాల్ జె.సుధాకర్, వి.మధుసూదనరావు, కోఆర్డినేటర్ శివ రామకృష్ణ పాల్గొన్నారు.

పారిశ్రామిక ప్రాంతంలో కాలుష్యంతో ఇప్పటికే అనేక రోగాల బారిన పడుతున్న ప్రజలకు తాజాగా మరో సమస్య వచ్చి పడింది. సరైన రోడ్డు సౌకర్యం లేక నిత్యం ఇబ్బందులు పడుతున్న ఈ ప్రాంత ప్రజలకు, కొందరు వ్యాపారులు తమ స్వార్థంతో కొత్త తలనొప్పులు తెచ్చిపెడుతున్నారు. మల్కాపురం పోలీస్‌స్టేషన్ నుంచి యారాడ వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపులా భవన నిర్మాణ సామగ్రిని గుట్టలుగా వేస్తున్నారు. మరో వైపు రహదారులను ఆక్రమించి వ్యాపారాలు చేస్తూ ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు.

\- సింధియా



యారాడ వెళ్లే మార్గంలో రోడ్డుకు ఇరువైపులా డంప్ చేసిన భవన నిర్మాణ వ్యర్థాలు



రోడ్డుపై వేసిన భవన నిర్మాణ సామగ్రి వల్ల నేలకొరిగిన యారాడ సూచీ బోర్డు

రహదారులా.. డంపింగ్ యార్డులా...

రోడ్లకిరువైపులా గుట్టలు గుట్టలుగా భవన నిర్మాణ సామగ్రి • పట్టించుకోని అధికారులు



రోడ్డు పక్కన వేసిన భవన నిర్మాణ సామగ్రిని తరలిస్తున్న వ్యాపారస్తులు

రోడ్డు పక్కనే ఇసుక, సిమెంట్, కంకర వంటి నిర్మాణ సామగ్రిని డంప్ చేయడంతో పాదచారుల కు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. పారిశ్రామిక ప్రాంతంలో భవన నిర్మాణాలు ఊపందుకోవడంతో, అక్కడి వ్యర్థాలను సైతం యారాడ మార్గంలో ఖాళీ స్థలాల్లో అడ్డగోలుగా పడేస్తున్నారు. అడిగే నాథుడే లేకపోవడంతో, ఒకవైపు భవన నిర్మాణ సామగ్రితోనూ, మరో వైపు వ్యర్థాలతోనూ ఈ ప్రధాన రహదారి డంపింగ్ యార్డును తలపిస్తోంది.

అధికారులు ఏం చేస్తున్నారో..

ఎప్పటికప్పుడు రోడ్డు నిర్వహణను పర్యవేక్షించాల్సిన అధికార యంత్రాంగం కార్యాలయాలకే పరిమితమవుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. క్షేత్ర స్థాయిలో రోడ్లను పరిశీలిస్తూ ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాల్సిన అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో పరిస్థితి మరింత దిగజారుతోంది. ఈ కారణంగా వాహనదారులు ప్రమాదాల బారిన పడటమే కాకుండా, దుమ్ము, ధూళితో స్థానిక ప్రజలు తీవ్రమైన ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. దీంతో మల్కాపురం నుంచి యారాడ మార్గంలో ప్రయాణించాలంటేనే ప్రజలు హడలిపోతున్నారు.

రోడ్లను ఆక్రమించి...

నిబంధనలు గాలికొదిలేసి వ్యాపారాలు సాగిస్తున్న కొందరు, సర్వీసు రోడ్లను సైతం ఆక్రమించి భవన నిర్మాణ సామాగ్రిని వేసి అక్రమ వ్యాపారాలు చేస్తున్నారు. భారీ వాహనాలకు అనుమతి లేకపోయినా, నిబంధనలను ఉల్లంఘిస్తూ ఈ దారుల్లో యథేచ్ఛగా తిరుగుతున్నాయి. ఈ అక్రమ వ్యాపారాలకు ఓ స్థానిక రాజకీయ నేత అండదండలు ఉన్నాయనే ఆరోపణలు స్థానికంగా బలంగా వినిపిస్తున్నాయి. ఆ నేతే చక్రం తిప్పుతూ వ్యాపారుల నుంచి లక్షల్లో వసూలు చేస్తున్నాడని, తన మాటే శాసనంగా చలామణి అవుతూ అధికారులను సైతం తన చెప్పుచేతల్లో ఉంచుకుంటున్నాడని సమాచారం.

అధికారులు స్పందించాలి

ఉన్నతాధికారులు స్పందించి, స్థానిక నేతల అండతో రెచ్చిపోతున్న వ్యాపారుల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు వేడుకుంటున్నారు. రోడ్డుకు ఇరువైపులా భవన నిర్మాణ సామగ్రిని వేసి వీధి వ్యాపారాలు చేస్తున్న వారిని నియంత్రించాలని, యారాడ మార్గంలో వ్యర్థాలు డంప్ చేస్తున్న వారిపై **చర్యలు తీసుకోవాలని, సర్వీసు రోడ్లపై భారీ వాహనాల రాకపోకలను నిరోధించాలని స్థానికులు** డిమాండ్ చేస్తున్నారు. లేదంటే, పారిశ్రామిక కాలు**ష్యంతో సతమతమవుతున్న** ఈ ప్రాంత ప్రజలకు, **ఈ అక్రమ ఆక్రమణలు** మరింత శాపంగా మారే ప్రమాదం ఉంది.

చాలా ఇబ్బందిగా ఉంది



మల్కాపురం నుంచి యారాడ వేళ్లే దారిలో రోడ్డుకు ఇరువైపులా భవన నిర్మాణ సామగ్రి వేయడంతో ఈ మార్గంలో ప్రయాణించాలంటేనే చాలా ఇబ్బందిగా ఉంది. ఆదివారం ఇదే మార్గంలో మార్కెట్ కూడా జరు గుతుండడంతో సమస్య మరింత తీవ్రంగా ఉంటోంది. వాహనాలను మెయిన్‌రోడ్డులో వదిలి కిలోమీటర్ల దూరం నడుచుకుంటూ మార్కెటుకు వెళ్లి రావాల్సి వస్తుంది. వెంటనే రోడ్డుకు ఇరువైపులా ఖాళీ ప్రదేశాల్లో భవన నిర్మాణ సామగ్రిని తొలగించాలి.

\- దాసరి రవి, మల్కాపురం

చర్యలు తీసుకోవాలి



ప్రముఖ పర్యాటక ప్రాంతం యారాడకు వెళ్లే రోడ్డుకు ఇరువైపులా అక్రమార్కులు భవన నిర్మాణ వ్యర్థాలను డంప్ చేస్తున్నారు. ఇటీవల వేసిన రోడ్డుపై పిక్క, కంకర పడి ప్రయాణికులు ప్రమాదాలకు గురయ్యారు. రోడ్డుకు ఇరువైపులా వ్యర్థాలు పేరుకుపోవడంతో రోడ్డు కుదించుకుపోయింది. ప్రయాణం చేయాలంటేనే ఇబ్బందిగా ఉంది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

\- సతీష్, స్థానికుడు

ఉగ్రవాదులను తరిమికొట్టాలి



ఉగ్రవాదుల దాడిలో మృతులకు నివాళులర్పిస్తూ కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ చేస్తున్న నాయకులు

మల్కాపురం: జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో టూరిస్టులపై ఉగ్రదాడిని ఖండిస్తూ, అమరులైనవారికి నివాళులర్పిస్తూ పలుచోట్ల శాంతి ర్యాలీలు జరిగాయి. కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నాయకులు దాకరపు నూకరాజు యాదవ్ మాట్లాడుతూ, ఉగ్రవాదులు సమాజానికి చీడపురుగులని, వారిని మొదట్లోనే అణిచివేయాలని అన్నారు. 60వ వార్డు గుల్లలపాలెం నుంచి 61వ వార్డు మల్కాపురం వరకు కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎర్రయ్య, సబ్బవరపు శ్రీను, ఉరుకూటి శ్రీనుయాదవ్, నడిపూరు వెంకటరమణ, సత్తిబాబు, అప్పారావు, కనకరాజు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. పారిశ్రామిక ప్రాంత జర్నలిస్టుల సంఘం ఆధ్వర్యంలో శ్రీహరిపురం నుంచి మల్కాపురం వరకు కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ జరిగింది. సంఘం గౌరవ అధ్యక్షుడు కళారత్న సుంకర చలపతిరావు ఉగ్రదాడిని తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో నార్త్ ఇండియన్స్ అసోసియేషన్ ప్రతినిధులు, విద్యా సంస్థల ప్రతినిధులు, సామాజిక సేవా కార్యకర్తలు పాల్గొన్నారు.

డీఎస్సీలో నాన్‌లోకల్ శాతాన్ని తగ్గించాలని వినతి

ఎంవీపీకాలనీ: డీఎస్సీ నోటిఫికేషన్‌లో నాన్‌లోకల్ శాతాన్ని తగ్గించాలని నిరుద్యోగుల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంత్ కోరారు. ఈ మేరకు ఎంవీపీకాలనీలో ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. డీఎస్సీలో నాన్‌లోకల్ పోస్టులుగా రాష్ట్ర ప్రభుత్వం 20 శాతం కేటాయించిందని, గతంలో తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీలో నాన్‌లోకల్‌కు కేవలం 5 శాతం పోస్టులే కేటాయించిందని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో డీఎస్సీ నోటిఫికేషన్‌లో నాన్‌లోకల్ పోస్టుల శాతాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. గత కొన్నేళ్లుగా డీఎస్సీ నోటిఫికేషన్ లేనందున ఉద్యోగ వయోపరిమితిని 47 ఏళ్లకు పెంచాలని, టెట్ అర్హత పొందిన ప్రతి అభ్యర్థి డీఎస్సీ రాసేందుకు అనుమతించాలని కోరారు.

సమస్యలు పరిష్కరించాలని ఆందోళన



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ప్లకార్డులతో ధర్నా చేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు

సీతమ్మధార: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ హెల్త్ ప్రొవైడర్స్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు పి.మణి వారికి మద్దతు నిలిచి మాట్లాడారు. ఆరోగ్య శాఖలో కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులతో సమానంగా వేతన సవరణ చేయాలన్నారు. వీరి పోరాటానికి సీఐటీయూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్స్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు ఎం.ఎస్.ఎన్. ప్రజ్ఞ, కార్యదర్శి గంట సుధ మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం 6 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సీహెచ్‌వోలను రెగ్యులర్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. పని ఆధారిత ప్రోత్సాహకాలను క్రమబద్ధీకరించాలని, ఈపీఎఫ్ పునరుద్ధరించాలని, క్లినిక్ అద్దె బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. హెచ్‌ఆర్ పాలసీ, ఇంక్రిమెంట్, ట్రాన్స్‌ఫర్, ఎక్స్‌గ్రేషియా మొదలగునవి అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు జి. సుధారాణి, పి.దివ్య, బి. శ్రావణి, టి.మోషే, జస్వంత్ తదితరులు పాల్గొన్నారు.

పోర్టులో అంబేడ్కర్ జయంతి



టెన్త్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో వీపీఏ చైర్‌పర్సన్ అంగముత్తు

విశాఖ సిటీ: విశాఖ పోర్ట్ అథారిటీలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 134వ జయంతి నిర్వహించారు. మంగళవారం వీపీఏ పరిపాలన భవనంలోని సాంబమూర్తి ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో పోర్టు చైర్‌పర్సన్ డాక్టర్ ఎం.అంగముత్తు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దార్శనికుడు అంబేడ్కర్ నాయకత్వంలో రూపొందించిన భారత రాజ్యాంగం దేశానికి మార్గనిర్దేశం చేస్తుందని పేర్కొన్నారు. అనంతరం పదో తరగతి పరీక్షల్లో చక్కటి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెరిటోరియస్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో వీపీఏ డిప్యూటీ చైర్‌పర్సన్ దుర్గేష్‌కుమార్ దుబే, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ పి.ఎస్.ఎల్.స్వామి, వీపీఏ ఎస్సీ, ఎస్టీ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.ఉమామహేశ్వరరావు, కార్యదర్శి ఎం.దేవీశ్వరరావు, ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఒ.రామలింగం, కార్యదర్శి జి.శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి,ఉపాధ్యాయుల నిష్పత్తి 1:40 ఉండాలి

డీఈవోకు ఉపాధ్యాయ సంఘాల వినతి



డీఈవో ప్రేమ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

ఆరిలోవ: పాఠశాలల్లో విద్యార్థి, ఉపాధ్యాయుల నిష్పత్తి 1:40 ఉండే విధంగా అమలు చేయాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు ఉపాధ్యాయ ఐక్య కూటమి తరపున ఎస్టీయూ, పీఆర్‌టీయూ నాయకులు, హెచ్‌ఎం అసోసియేషన్ సభ్యులు మంగళవారం డీఈవో ఎస్.ప్రేమకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం 117 జీవోను రద్దు చేయడాన్ని స్వాగతిస్తున్నామని అందులో పేర్కొన్నారు. అయితే విద్యార్థి, ఉపాధ్యాయుల నిష్పత్తి 1:53 నిర్ణయించడం మాత్రం మంచి విధానం కాదన్నారు. దీని వల్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయుల సంఖ్య తగ్గిపోతుందన్నారు. దీంతోపాటు తరగతి గదిలో విద్యార్థుల పట్ల ఉపాధ్యాయుల పర్యవేక్షణ కూడా లేకుండా పోతుందన్నారు. నాయకులు ఇమంది పైడిరాజు, డి.గోపినాథ్, కృష్ణకుమార్, ఎం.శ్రీనివాసరావు, బాబూలాల్, వేణుగోపాలరావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కోక్ ఓవెన్స్ అధిక పుషింగ్స్‌లో కాంట్రాక్ట్ కార్మికులు కీలకం



పదవీ విరమణ కార్యక్రమంలో పాల్గొన్న విభాగాధిపతి, అధికారులు, కార్మిక నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కోక్‌ఓవెన్స్ విభాగంలో 380 పుషింగ్స్ చేయడంలో కాంట్రాక్ట్ కార్మికులు కీలక పాత్ర పోషిస్తున్నారని కోక్‌ఓవెన్స్ విభాగాధిపతి ఎం.వి.ఎస్. దుర్గాప్రసాద్ అన్నారు. ఈ నెలాఖరున పదవీ విరమణ చేస్తున్న విభాగ ఉద్యోగులు సీహెచ్. నరసింహారావు, వి.అప్పలనాయుడులకు మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాల్గొన్న దుర్గాప్రసాద్ వారి సేవలను కొనియాడారు. అనంతరం, బ్యాటరీ -4లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సేవలను గుర్తిస్తూ వారికి బహుమతులు అందజేశారు. కోక్‌ఓవెన్స్ బ్యాటరీని సొంత బిడ్డలా చూసుకుంటూ ఉత్పత్తికి సహకరిస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో జీఎం వైవీఆర్. శ్రీనివాస్, డీజీఎంలు బి. వేంకటేశ్వరరావు, కె. రాజగోపాల నాయుడు, సీనియర్ మేనేజర్లు తాతాపూడి శ్రీనివాసరావు, ఎస్.కె. తివారి, కార్మిక నాయకులు ముసినాడ శ్రీనివాస్, ఆనందకుమార్, ఎస్. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అ'విశ్రాంత' కార్మికురాలు

- పదవీ విరమణ పొందినా సేద తీరని చేతులు
- స్ఫూర్తి చాటుతున్న పారిశుధ్య కార్మికురాలు అప్పయ్యమ్మ

అప్పయ్యమ్మ... మూడు దశాబ్దాల పాటు వీధులను శుభ్రం చేసిన శ్రమజీవి. ఇటీవల పదవీ విరమణ పొందినా, ఆమె చేతులు మాత్రం సేదదీరడం లేదు. యూనిఫాం విప్పినా, కర్తవ్యం ఆమెను వీడ లేదు. రోజూ ఉదయాన్నే తన చీపురుతో వీధుల్లో ప్రత్యక్షమవుతోంది. విశ్రాంతి తీసుకోవడం ఆమె నిఘంటువులోనే లేదట! ఊపిరి ఉన్నంత వరకు పారిశుధ్య కార్మికురాలిగానే ఉంటానని చెబుతున్న ఈ నిస్వార్థ సేవకురాలు అందరికీ ఆదర్శం.

\- గోపాలపట్నం



రోడ్డు తుడుస్తున్న అప్పయ్యమ్మ



రిటైర్మెంట్ సందర్భంగా సత్కరిస్తున్న సహచర కార్మికులు, అధికారులు (ఫైల్)

జీవీఎంసీ 92వ వార్డు, శ్రీరామ్‌నగర్... ఇక్కడ అప్పయ్యమ్మ అంటే తెలియని వారంటూ ఉండరు. ఆమె ఒక సాధారణ పారిశుధ్య కార్మికురాలు కాదు.. విశ్రాంతి అనే పదానికి అర్థం తెలియని శ్రమజీవి. స్వేదాన్ని సౌందర్యంగా, సుగుణాన్ని నైజంగా మలుచుకుంది. అప్పయ్యమ్మ ఇటీవల ఉద్యోగ విరమణ పొందింది. ఆ వార్డులోని తోటి కార్మికులంతా కలిసి ఆమెను ఘనంగా సత్కరించారు. పని పట్ల ఆమె నిబద్ధతను సూపర్‌వైజర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు కొనియాడారు. ఆత్మీయ వీడ్కోలుతో అప్పయ్యమ్మ ఉబ్బితబ్బిబ్బయింది. సహచరుల అభిమానానికి ఆమె కళ్లల్లో ఆనందభాష్పాలు మెరిశాయి. 'ఈ రోజు నుంచి పనికి రావద్దు అమ్మా, ఇంటి దగ్గర విశ్రాంతి తీసుకో' అని చెప్పగానే అప్పయ్యమ్మ తల్లడిల్లిపోయింది. 'రావాద్దనకయ్యా... నాకు తెలిసిన పని ఇదే, వస్తానయ్యా' అంటూ అధికారులను బతిమాలింది. 'నన్ను పని నుంచి విడదీయకండయ్యా' అని ప్రాధేయపడింది.

సెలవు పెట్టకుండా..

అప్పయ్యమ్మకు ముగ్గురు కొడుకులు, ఒక కూతురు. అందరూ కూలీ పనులు చేసుకుంటూ సుఖంగానే ఉన్నారు. తిండికీ, గుడ్డకూ లోటు లేదు. కానీ అప్పయ్యమ్మకుమాత్రం పారిశుధ్య పనిలో చేరిన నాటి నుంచి సెలవు లేకుండా పనిచేయడం వృత్తిపట్ల ఆమెకున్న నిబద్ధత. అందుకే ఆమె అంటే అందరికీ గౌరవం.

రిటైరైనా వృత్తిని వీడలేదు

రిటైరైనా ఆమె అదే ప్రాంతంలో పనిచేస్తూనే ఉంది. ప్రతిరోజూ సమయానికి వచ్చి తన పరిధిలోని రోడ్లను శుభ్రం చేస్తోంది. ఎవరైనా పదో, పరకో ఇస్తే తీసుకుంటుంది. ఉదయం, సాయంత్రం ఇదే పని. అధికారులు, సూపర్‌వైజర్లు ఎంత చెప్పినా ఆమె పని చేయడం మానడం లేదు. 'వీధుల్లో సరిగా తుడవని కార్మికులను చూశాం కానీ, రిటైరైనా పని చేస్తాను, ఈ అలవాటు మానను అని చెప్పే అప్పయ్యమ్మను మేం తొలిసారి చూస్తున్నాం' అని స్థానికులు చెబుతున్నారు. అందుకే ఆమెను వారంతా ఆదరిస్తున్నారు, అక్కున చేర్చుకుంటున్నారు. శ్రీరామ్‌నగర్ వాసులకు అప్పయ్యమ్మ కేవలం ఒక పారిశుధ్య కార్మికురాలు కాదు, ఒక ప్రేరణ, ఒక ఆదర్శం. శ్రమను ప్రేమించే ప్రతి హృదయానికి ఆమె ఒక నిలువెత్తు నిదర్శనం.

రైలు ప్రయాణికులకు ఉచితంగా మినరల్ వాటర్ బాటిళ్లు

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్‌లో ప్రతిరోజూ మధ్యాహ్నం వచ్చే రైళ్లలోని సాధారణ బోగీల ప్రయాణికులకు ఉచితంగా మినరల్ వాటర్ బాటిళ్లు అందించనున్నారు. ఈ మేరకు డీఆర్‌ఎం (కమర్షియల్) అనుమతిచ్చారని తూర్పు కోస్తా రైల్వే జోనల్ కన్సల్టెన్సీ కమిటీ సభ్యుడు కంచుమూర్తి ఈశ్వర్, మానవ వికాస వేదిక కన్వీనర్ ఎం.ఎస్.ఎన్.మూర్తి తెలిపారు. బుధవారం నుంచి జూన్ మూడో వారం వరకు రోజూ మధ్యాహ్నం వచ్చే సుదూర ప్రాంతాల రైళ్లలోని ప్రయాణికులకు 500 ఎంఎల్ మినరల్ వాటర్ బాటిళ్లను ఉచితంగా పంపిణీ చేస్తారు. లయన్స్ క్లబ్, మానవ వికాస వేదిక, స్పందన చేయూత ఫౌండేషన్, సర్వహిత చారిటబుల్ ట్రస్ట్, మానవతా చారిటబుల్ ట్రస్ట్, సత్యసాయి సేవా ట్రస్ట్, దువ్వాడ రైల్వే యూజర్స్ అసోసియేషన్ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నాయి. రోజూ 500 మందికి ఉచితంగా నీటి బాటిళ్లు అందించాలని నిర్ణయించారు.

దేవీపురంలో సంస్కృత భాష అభ్యాసకులు



దేవీపురం శ్రీచక్ర ఆలయం వద్ద శోభాయాత్రగా వచ్చిన సంస్కృత అభ్యాసకులు

సబ్బవరం: వేసవి శిబిరం- సంస్కృత సప్తాహం కోసం పలు రాష్ట్రాల నుంచి వచ్చిన అభ్యాసకులు మంగవారం దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవిని దర్శించుకున్నారు. సంస్కృత భాషను అట్టడుగు ప్రజలకు అందించాలనే సంకల్పంతో దేశ విదేశాల్లో కృషి చేస్తున్న సంస్కృత భారతి స్వచ్ఛంద సంస్థ ఈ శిబిరాన్ని అనకాపల్లి జిల్లా కోడూరులో ఏర్పాటు చేసింది. శిబిరంలో శిక్షణ పొందుతున్న వీరంతా కోడూరు నుంచి దేవీపురం వరకూ శోభాయాత్రగా తరలి వచ్చి, దేవిని దర్శించుకున్నారు.